



# జయక్రిష్ణా హాలుకి జయము జయము

'యోవ్ కరీంసాయెబా! సినిమాహాలు కడదామనుకుంటున్నానయ్యా. ఏందంటావు మందలా?' అన్నాడంట ఐటిఐ క్రిష్ణమూర్తి ఒక రోజు మా నాయనతో.

ఐటిఐ క్రిష్ణమూర్తి ఇంటి పేరు ఏందోగానీ మా ఊళ్లో అందరూ ఆయన్ని ఐటిఐ క్రిష్ణమూర్తి అనే పిలస్తారు. ఎందుకంటే మా ఊరి అవతల ఆయనకి ఒక ఐటిఐ కాలేజీ ఉంది. అది పెట్టినప్పటాల్నించి ఆయన ఐటిఐ క్రిష్ణమూర్తి అయినాడు.

'కిష్టన్నా. సినిమాహాలు ఐడియా మంచిదే... కానీ ఊళ్లో కడితేనే గదా మేలు. ఊరికి అవతల ఇంత దూరంలో కడతానంటా ఉన్నావు. ఆలోచించుకో' అన్నాడంట మా నాయన.

'లేదు కరీంభాయ్.. నా యిల్లూ వాకిలీ యీణ్ణే. కాలేజీ ఉండేదీ యీణ్ణే. స్తలాలు ఉన్నది కూడా ఈణ్ణే. కాలేజీ యీడ పెట్టుకొని సినిమాహాలు ఊళ్లో కట్టి ఆడొక కాలు ఈడొక కాలు పెట్టి తిరిగితా ఉంటే రెండూ దెబ్బ తిని పోతాయి. సినిమా బాగుంటే జనం

ఎంతదూరమైనా వొస్తారు. ఈణ్ణే కడదాములే' అన్నాడంట ఐటిఐ క్రిష్ణమూర్తి.

'సరే అట్నేకానీ' అన్నాడంట మా నాయన.

హాలు పని మొదలయ్యింది. మా ఊళ్లో దాని మీద మాటలు కూడా మొదలైనాయి – 'ఐటిఐ క్రిష్ణమూర్తి సినిమా హాలు కడతా ఉన్నాడంట. జయక్రిష్ణా హాలు అని పేరు పెట్టి నాడంట. ఊరవతల కడితే ఎవరు ఎళతాడమ్మా సినిమాలకి.. తొలాట రెండో ఆటా వొదిలి నాక ఆ చీకట్లో తిరిగి ఇళ్లు చేరేదానికేనా?' అని అమ్మలక్కలు అనుకుంటే–

'ఈ వాటాన ఐటిఐ క్రిష్ణమూర్తి మనందరిచేత సైకిళ్లు కొనిచ్చేట్టున్నాడయ్యా. సైకిళ్లు లాకుండా ఆడదాకా ఎవడు పోతాడు?' అని మొగోళ్లు అనుకున్నారు.

మొత్తం మీద మా నాయన వైరింగుతో, ఆయనతోపాటు తక్కిన వాళ్లంతా క్రిష్ణమూర్తి మీద ప్రేమతో చేసి పెట్టిన పనితో సినిమాహాలు పూర్తయ్యింది. అప్పటికే ఊళ్లో ఉన్న నాలుగు సినిమాహాళ్లతో యిసిగిపోయి ఉన్న జనం క్రిష్ణమూర్తి దూండాంగా కట్టిన సినిమాహాలుకి ఓ అంటా క్యూలు కట్టడం మొదలుబెట్టినారు.

ఎర్రమల్లెలు, యిప్లవశంఖం లాంటి సినిమాలు బలే ఆడినాయి అక్కడ. ఆ తర్వాత హిందీ సినిమాలు వొచ్చి షాను గీను అంటా అవి కూడా బాగా ఆడినాయి. అమితాబచను సావుబతుకుల్లో ఉండి యాక్టు చేసినాడే 'కూలీ' అని... ఆ సినిమా అయితే అదరగొట్టే సింది.

కానీ ఏం లాబం? రాను రాను కలెక్షన్లు డల్ అయిపోయినాయి. ఆడోళ్లు పోయేదానికి పాలుమారే సినిమాహాళ్లు బతికి బట్టకట్టడం కష్టమని జయక్రిష్ణా హాలుతో తేలిపోయింది. ఎంతమంచి హాలైనా ఊరికి దూరంగా ఉంటే ఎవరు పోతారు?

సరే, అప్పటికి ఆ హాలు టైము బాగాలేకనో లేక మా టైము బాగుండోగానీ కరెక్టుగా మేము తొమ్మిది పదికి వొచ్చే టయానికి జయక్రిష్ణా హాలులో ఇంగిలీషు సినిమాలు మొద లైనాయి. ఇంతకు ముందర దానిలో 'జాస్' లాంటి చేపల సినిమాలు ఆడినా ఇప్పుడు మాత్రం తెలుగు హిందీ సినిమాలు కంప్లీటుగా బందుచేసి ఉత్త ఇంగిలీషు సినిమాలనే మొదలుబెట్టినారు.

మొదటగా 'ది ప్రొటెక్టర్' అంటా ఒక సినిమా వొచ్చింది. జాకీచాను హీరో. అప్పటికి ఫస్టు టైము మేము జాకీచాను పేరు యినడం.

'మావా. వాడెవడో జాకీచాను అంట. సూపరుగా చేస్తాడంట ఫైట్లు. మోటారు సైకి లుని గాల్లోకి లేపినాడంటే పదహారు కిలోమీటర్ల అవతలేనంట దించేది బండి. వాడి దెబ్బ కి పది మంది చిరంజీవులు వొచ్చినా ఔటంటరా. ఎట్టాగైనా మనం ఆ సినిమా చూడా ల్సిందేరా' అన్నాడు కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుగాడు ఒక రోజు శ్రీదరు కాడికీ నా కాడికీ వచ్చి అమిత ఆశగా.

దానికి శ్రీదరుగాడు అందుకొని 'అవునురా. మా నాయన చెప్తా ఉంటే యిన్నా. జాకీ చానుది స్ప్రింగు ఒళ్లంటా. ఎల్లికిలా పొణుకొని బ్యాకు నుంచి బ్యాకే లేస్తాడంట పైకి. మనం చూద్దాములా' అన్నాడు వాడు కూడా ఆశగా.

ఫ్రెండ్సు కోరే అట్టాంటి కోరికలకి మనం ఎప్పుడూ సపోర్టుగానే ఉంటాంగదా. వాళ్లకు మందల చెప్పా.

'ఒరే... మీరిద్దరూ అంతగా చెప్పబల్లేదురా. ఆల్రెడీ నేను ప్లాను గీసిపెట్టున్నానురా. జయక్రిష్ణా హాలులో మ్యాట్నీ మూడున్నరకి. మనకు యింటర్‌బెల్లు మూడున్నరకి. బెల్లు కొట్టంగానే సైకిలు మీదెక్కి కరెక్టుగా ఒక్క తొక్కు తొక్కినామంటే సరిగ్గా పది నిమిషాల్లో హాలు కాడ ఉంటాము. పావుగంట సినిమా పోతే పోయినా ఎవురికీ మన మీద డౌటు రాదురా. ఇటు ఇస్కూలికి పోయినట్టుగా ఉంటుంది. అటు మ్యాట్నీ చూసినట్టుగా ఉంటుంది. ఇస్కూలు వొదిలే టయానికి ఇళ్లకి చేరుకుంటాము కాబట్టి ఒక్కదెబ్బలో రెండు పనులు అయిపోతాయి మామా' అన్నాను డీటైలుగా.

అందరికీ ఆ ప్లాను నచ్చింది.

'అంతా బాగానే ఉందిరా. మరి డబ్బులు ఎట్టరా?' అన్నాడు శ్రీదరుగాడు.

'ఏముందిరా. కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజు రాజుల వొంశంలో పుట్టినాడు గాబట్టి మూడు నేల టికెట్ల డబ్బులు వాడు పెట్టుకోవాల్సిందేరా. వాడికి సైకిలు లేదు గాబట్టి సైకిలు అరేంజిమెంటు నీదిరా. నీ బిఎస్సెఎ ఎస్సుల్లార్ మీద ముందొకరం ఎనకొకరం కూచుంటే యీజీగా ముగ్గురం ఎళ్లిపోవచ్చు. ఇంక సినిమాకి ప్లాను నేను చెప్పినాను గాబట్టి నా వాటా అదేరా' అన్నాను నేను.

అది యిని కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజు యికారంగా పెట్టినాడు మొకం.

నేను వాడికి దైర్నం చెబుతా 'మావా. నువ్వట్టా డల్లయిపోకురా. మీ నాయన చొక్కా యిప్పి పొణుకొని ఉన్నప్పుడు పావలా అర్దా తీస్తా ఉంటావుగదరా. యింక మీదట మూడు నాలుగు రూపాయలు తీస్తా ఉండు. మనం ఒక్కసారి తప్పు చెయ్యనేకూడదు. చేసినాక ఇంక పావలా ఏంది? పదిరూపాయలు ఏంది? అంతా ఒకటే... పోరా.. నీకు తిరుగులేదు పోరా' అన్నాను వాడితో.

'అంతేనంటవా?' అన్నాడు వాడు.

'అంతేరా' అన్నాను నేను.

అప్పట్నించి మాకు జయక్రిష్ణా హాలు ఇంగిలీషు సినిమాలు అలవాటయినాయి. డబ్బులు మదుసూదనరాజువి. సైకిలు శ్రీదరుగాడిది. ప్లాన్లు నాయి.

ప్లాన్లదేముంది ప్లాన్లు... డబ్బులు ఎగనూకేదానికి ఈడి డావులు గాకపోతే అని అనుకుంటా ఉన్నారా? ఆడే ఉంది కష్టమంతా.

అసలికే మనం పోతున్నది జయక్రిష్ణా హాలుకి. పైగా ఇంగిలీషు సినిమాలకి. అది కూడా ఇస్కూల్లో లాస్టు టూ పిరీడ్లు ఎగ్గొట్టి. ఈ పనిలో గనక మనం కుమారస్వామి ఐవోరి కంట పడినామో... అంతే ఔటు. మిగిలిన ఐవోర్ల కంట పడినా ఢమాలే. అంతదాకా దేనికి? ఈ సంగతి మన క్లోజు ఫ్రెండులకి తెలిసిందనుకో వాళ్లా సంగతి కడుపుల్లో పెట్టుకుందామని అనుకోకుండా నేరుగా పోయి ఐవోర్ల చెవుల్లో ఊదినా కష్టమే. అందుకని వాళ్లకు కూడా తెలియనివ్వకూడదు.

దానికంటే ముక్యంగా యింకో కష్టముంది. అదేమంటే జయక్రిష్ణాహాలుకు పోయే దోవలో మన అన్నలో అయ్యలో మనల్ని చూడకూడాదు. ఇది ఇస్కూలు వాళ్లు చూడటం కన్నా డేంజరు. ఈ వొయసులో ఇంగిలీషు సినిమాలు కావలసి వొచ్చినాయా అని చెమ

డాలు తీసేస్తారు. అందుకని వాళ్ల కంట పడకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు అడ్డదారుల్లో ఎళ్లాలి. ఇంక పుస్తకాలతో సినిమాహాళ్లకి ఎళితే బడి ఎగనూకి వొచ్చినారా అని అడగతారు గాబట్టి వాటిని బొడ్లలో దోపుకోవాలి. సినిమాహాల్లో కూడా మనం ఒకరికంట పడకుండా ఉండాలంటే స్టార్టు అయినాక చీకట్లో ఎళ్లి ఎండు పడే ముందరే చీకట్లో బయటకి వొచ్చేయాలి.

ఇన్ని అవస్తలు ఉన్నాయి. యీటన్నింటికీ ప్లాన్లు బళ్లేదా? ఆ ప్లాన్లకి కష్టం బళ్లేదా?

అందుకనే కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుగాడూ కేతిరెడ్డి శ్రీదరుగాడూ అంటా ఉంటారు– 'మావా. నువ్వూ నీ ప్లాన్లూ లేకుండా ఉంటే అంతే మామా' అని.

రాను రాను మాకు ఇంగిలీషు సినిమాల వల్ల చాలా విషయాలు తెలియడం మొదలుబెట్టినాయి. కొత్త కొత్త హీరోలు తెలిసినారు. జాకీచాను, సిల్వస్టరు స్టాలెను తర్వాత జేమ్సుబాండు హీరో రోజర్‌మూరు తెలిసినాడు. వాడికి ముందరోడు సీన్‌కానరీ తెలిసినాడు. మద్య మద్యలో ఒమర్ మొక్తార్, మెకనాస్‌గోల్డు, టెన్‌కమాండ్‌మెంట్స్ లాంటి సినిమాలు కూడా చూసినాము...

ఇట్లా వరసబెట్టి ఆ సినిమాలు చూస్తా ఉండేసరికి మా నాలెడ్జీ పెరిగిపోయినట్టూ ఆ దెబ్బకి తెలుగు సినిమాలు చూసే కందుల, కాండూరి లాంటోళ్లంతా లోకువైనట్టూ మాకు అనిపించడం మొదలుబెట్టింది. ఆ మత్తు అట్టా సాగి సాగి పోస్టరు ఏంది సినిమా ఏంది అని గమనించుకోనంతగా పెరిగిపోయింది. అప్పుడే మా కర్మగాలి జయక్రిష్ణాలో ఒక దెయ్యాల సినిమాని ఒదిలినారు.

హాలు బయట పోస్టరు మీద 'పాల్టరు గీస్టు' అని నీటుగా అక్షరాలు ఉంటే ఏందోలే అనుకొని లోపలికి పోయినాముగానీ అడుగుపెట్టినాక దాని దెబ్బకి దడుచుకొని చచ్చినాము. అందులో మాయలు... కుర్చీలు కదలడం, బల్లలు కదలడం, ఉన్నట్టుండి ఆకాశంలో నుంచి దుమారం రావడం, రకంమారి సౌండ్లు, దెయ్యం ఆకారాలు...

అయన్నీ చూసేసరికి రాజుల వొంశంలో పుట్టిన కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుకి చెమటలు పట్టిపోయినాయి. శ్రీదరుగాడికీ నాకూ ఒంటేలు వొస్తున్నాయిగానీ బయటకిపోయి పోసుకోవాలంటే బయం.

ఆ సాయంత్రానికి మేము మనుషులుగా లేము. ముగ్గురికీ ఒకేరోజు అటూ ఇటూ తేడాతో జ్వరాలు కాసినాయి. నిద్దర్లలో మా పలవరింతలు చూసి శ్రీదరుగాడి నానమ్మ వాణ్ణి సుందరయ్యకాడికి తీసకెళ్లి దడుపుమంత్రం వేయిస్తే మా అమ్మ నన్ను దెయ్యాల బూబమ్మ కాడికి తీసకపోయి చీటాకు కట్టించింది. కేశవరాజుగారి అబ్బాయి మదసూదన రాజుగాడి సంగతికొస్తే వాడి చేతిలో వాళ్ల తాతల కాలం నాటి కత్తి ఒకటి పెట్టి దైర్నం నూరి పోసినారంట పెద్దోళ్లు.

ఆ తర్వాత వాడు ఇస్కూలికి వొచ్చి 'మావా. అదే లాస్టురా. ఇంక మీదట జయక్రిష్ణా వద్దురా' అన్నాడు మాతోటి.

'అవునురా వద్దురా. నాక్కూడా బయం ఏసిందిరా' అన్నాను నేను.

'నిజమేరా. కానీ నాలెడ్జి అంతా ఇంగిలీషు సినిమాల్లోనే గదరా ఉండేది. ఇప్పుడు టెన్తుకి వాల్యూ యిచ్చి మానేసినా టెన్తు అయినాక చూద్దాముర' అన్నాడు శ్రీదరుగాడు.

'ఇంటరు అయినాక అయితే బెటరురా' అన్నాడు మదుసూదనరాజుగాడు.

'డిగ్రీ తర్వాత అయితే యింకా శబాషురా' అన్నాను నేను.

ముగ్గురం సరే అంటే సరే అనుకున్నాం.

అయితే యీ లోపలే జయక్రిష్ణా హాలుకి కష్టకాలం వొచ్చేసింది. దానిని బతికించేదానికి ఐటిఐ క్రిష్ణమూర్తి చాలా బాదలే పడినాడు. వీడియో పార్లల్ల హయాములో దానిని వీడియో దియేటరుగా కూడా మార్చినాడు. కానీ అది బతకలా. మూతబడిపోయింది. ఆ తర్వాత కొంతకాలం కళ్యాణమంటపంగా ఉండింది. ఇప్పుడు దానిని ఇళ్లుగానో అపార్టుమెంట్లుగానో మార్చారనో మారస్తా ఉన్నారనో యిన్నాను.

ఒకటి మాత్రం నిజం. జయక్రిష్ణా హాలు లేకుండా మా హైస్కూలు చదువు లేదు. మాదే కాదు మా ఊళ్లో చాలా మంది పిలకాయల చదువు లేదు.

ఇప్పుడంటే టీవీలు వొచ్చి పదహారు చానళ్లు వచ్చి ఆ దేశాలనీ ఈ దేశాలనీ చూపిస్తా ఉన్నాయిగానీ మొదట మొదట మాకు జయక్రిష్ణా హాలే రూపాయి నేల టికెట్టుతో లోకమంతా చూపిచ్చింది. మా నాలెడ్జి పెంచింది.

అది తలుచుకుంటే బాద. మా ఊరవతలి ఆ హాలు ఇప్పుడు లేదంటే బాద.

గుడ్ బై. పోయిరా జయక్రిష్ణా.

■